క్లుప్తంగా

6నుంచి కేయూ దూరవిద్య బీఈడీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) బీఈడీ (డీఎం) ఎక్స్ అభ్యర్థులకు ఈనెల 6వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6, 8, 12, 14, 16, 19, 21, 23వ తేదీల్లో ఆయా ఎక్స్ బీఈడీ అభ్యర్థులకు పరీక్షలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపస్‌లోని యూనివర్సిటీ విద్యా కళాశాలలో పరీక్ష కేంద్రంలో పరీక్షలు జరుగుతాయని వివరించారు.

రుద్రేశ్వరస్వామికి పుష్పార్చన

హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వేయి స్తంభాల దేవాలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠ శర్మ, అర్చకులు ఉదయం సుప్రభాతసేవ, ఉత్తిష్ట గణపతికి ఆరాధన, రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. సోమవారం లక్షతులసి అర్చన నిర్వహించనున్నట్లు ఉపేంద్ర శర్మ తెలిపారు.

అర్ధ నారీశ్వరుడిగా సంతాన లింగేశ్వరుడు

కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో సంతాన లింగేశ్వర స్వామిని అర్ధ నారీశ్వరస్వామిగా అలంకరించి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణశర్మ బిళ్వదళం, మారేడు ఆకులు, పూలతో పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపకులు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి, సాయికృష్ణ శర్మ, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ పాల్గొన్నారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

మడికొండ: మనస్తాపంతో ఉరేసుకొని పదవ తరగతి విద్యార్థిని మారబోయిన కీర్తన (17) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని భట్టుపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన కీర్తనను 'నీతో తిరుగుతూ మా అమ్మాయి చెడిపోతోంది' అని తోటి స్నేహితురాలి తల్లి పది రోజుల క్రితం తిట్టింది. నవంబర్ 28వ తేదీన మరోసారి భట్టుపల్లి చౌరస్తా వద్ద తిట్టడంతో అవమాన భారంతో మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కీర్తన ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రాజబాబు వివరించారు. మృతురాలి తండ్రి మారబోయిన రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మానసిక దివ్యాంగులకు సహకారం అందిస్తా..

హన్మకొండ కల్చరల్: మానసిక దివ్యాంగులకు సహాయ సహకారాలు అందిస్తానని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాలను పురస్కరించుకుని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో దివ్యాంగుల వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉపేందర్ రావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవి, ధన్ సాయి, లక్ష్మణ్, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ స్పాండ్, డాక్టర్ సుప్రియ, మల్లికాంబ సంస్థ నిర్వాహకులు బండా రామలీల, సదానందం, పద్మ, కోడం కల్యాణ్, పాల్గొన్నారు.

ఇకనైనా వర్సిటీలు బాగుపడేనా?

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలను పట్టించుకోకుండా పదేళ్లుగా ఉన్నత విద్యను నాశనం చేసి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేసిన పాలకులపై విసిగెత్తిన ప్రజలు, మేధావులు మార్పు కోరుకున్నారని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, జాయింట్ సెక్రటరీ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మార్పును తాము స్వాగతిస్తున్నామని, ఇక వర్సిటీలు బాగుపడుతాయని తాము భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన ప్రభుత్వం దృష్టి సారించాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని విద్యా, ఉపాధ్యాయరంగ సమస్యలతో సతమతమవుతున్న పరిధుల్లో కొత్తగా పగ్గాలు చేపటున్న నూతన ప్రభుత్వం ఇకపై ఆయా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ సదయ్య ఒక ప్రకటనలో కోరారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఖాళీ

కాశిబుగ్గ: బీఆర్‌ఎస్ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్ తన క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం రాత్రి ఆకస్మాత్తుగా ఖాళీ చేశారు. కొండా సురేఖ చేతిలో ఘోర పరాజయం చెందడంతో రాత్రిరాత్రే వాహనంలో సామగ్రిని తరలించారు. అందుకు సంబంధించిన ఓ వీడియోలో వాట్సప్‌లో వైరల్ అయింది.

పశ్చిమలో ఎగిరిన కాంగ్రెస్ జెండా

- 15,331 ఓట్ల ఆధిక్యంతో నాయిని రాజేందర్ రెడ్డి విజయం
- రెండో స్థానంలో నిలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మొదటిసారి కాంగ్రెస్ జెండా ఎగిరింది. తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో నవంబర్ 30న పోలింగ్ జరిగింది. ఆదివారం ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోటీ సాగింది. అందులో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. నియోజకవర్గంలో 1,67,155 ఓట్లు పోలయ్యాయి. 1,64,599 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. 130 ఓట్లు చెల్లలేదు. 2426 ఓట్లు నోటాకు పడ్డాయి. నాయిని రాజేందర్ రెడ్డికి 72,649 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దాస్యం వినయ్‌భాస్కర్‌కు 57,318 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి 15,331 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ నుంచి పోటీ చేసిన రావు పద్మకు 30,826 ఓట్లు పోలయ్యాయి. ఏడీఆర్‌పీ అభ్యర్థిగా పోటీ చేసిన యుగందర్ గౌడ్‌కు 1,399 ఓట్లు వచ్చాయి. బీఎస్‌పీ అభ్యర్థి మాదారపు రవి కుమార్‌కు 808 ఓట్లు పడ్డాయి. మొత్తం పోలైన 1,64,599 ఓట్లలో పోలింగ్ ద్వారా 1,62,394 ఓట్లు పోల్ కాగా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 4761 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో అధికంగా కాంగ్రెస్ అభ్యర్థి 3031 ఓట్లు వేయగా, బీజేపీ అభ్యర్థి రావు పద్మకు 894, దాస్యం వినయ్‌భాస్కర్‌కు 626 ఓట్లు పడ్డాయి. మార్తినేని ధర్మారావుకు 124 ఓట్లు వేశారు. నోటాకు 21 ఓట్లు వేశారు. మొత్తం ఓట్లలో తిరస్కరానికి గురైన ఓట్లు అన్ని పోస్టల్ బ్యాలెట్‌కు చెందినవి కావడం విశేషం, పోస్టల్ బ్యాలెట్‌లో 130 ఓట్లు తిరస్కరానికి గురయ్యాయి. ఇతరులకు 59 ఓట్లు వేశారు. పోస్టల్ బ్యాలెట్‌లో మెజారిటీ ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డికి రాగా, ఆ తర్వాతి ప్రాధాన్యత బీజేపీ అభ్యర్థి రావు పద్మకు దక్కింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ మూడవ స్థానంలో నిలిచారు.

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలు

రౌండ్	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ	రౌండ్	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ
1	3,454	3,972	2,559	10	3,559	4,332	1,737
2	3,009	3,866	1,946	11	3,813	3,605	1,164
3	3,016	4,040	1,758	12	3,966	4,404	1,397
4	2,960	3,331	2,225	13	3,047	3,920	1,510
5	3,110	3,933	2,375	14	3,682	3,928	1,222
6	2,930	4,968	1,505	15	2,554	3,773	1,463
7	3,404	3,883	1,752	16	2,076	3,360	1,593
8	3,436	3,232	2,167	17	2,726	4,136	1,490
9	3,624	4,042	1,349	18	2,326	2,893	720

ధ్రువీకరణ పత్రాల అందజేత



ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కొండా సురేఖ



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నాగరాజు

ఎమ్మెల్యేలుగా గెలిచిన అభ్యర్థులకు అధికారులు ధ్రువీకరణ పత్రాలను ఆదివారం అందజేశారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన నాయిని రాజేందర్‌రెడ్డి, తూర్పు నుంచి కొండా సురేఖ, వర్ధన్నపేట నుంచి కేఆర్.నాగరాజు విజయం సాధించి ధ్రువీకరణ పత్రాలను స్వీకరించారు. - సాక్షి నెట్‌వర్క్

కాంగ్రెస్ గెలుపుపై హర్షం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టనున్న సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు క్యాంపస్‌లోని మొదటి గేట్‌వద్ద సంబరాలు జరుపుకున్నారు.

కాజీపేట అర్బన్: హంటర్ రోడ్డులోని పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యాలయం ఎదుట డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. న్యూశాయంపేట చౌరస్తాలో 31వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు అంకేశ్వరపు సురేందర్ ఆధ్వర్యంలో, కడిపికొండ, భట్టుపల్లి గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు.

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట, హసన్‌పర్తి, భీమారం, వంగపహాడ్, సీతంపేట, అన్నాసాగరం, మడిపల్లి, గంటూరుపల్లి, చింతగట్టు ప్రాంతాల్లో నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు.

'నాయిని' విజయంతో సంబరాలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాజేందర్ రెడ్డి



రహమత్‌నగర్ చౌరస్తాలో..

హన్మకొండ: కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో ఆధిక్యం ప్రదర్శించినప్పటి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. విజయం సాధించి ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందుకుని కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు రాగానే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏనుమాముల మార్కెట్ నుంచి హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి రాజేందర్ రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కాజీపేటలో..

కాజీపేట: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా బాణసంచాలు కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ ఆనందోత్సవాలతో నృత్యాలు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్ రెడ్డి గెలుపొందడంతో స్వీట్లు పంపిణీ చేస్తూ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ విద్యార్థి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు ఎండీ.అంకూస్, జీ.రమణారెడ్డి, దువ్వ రాజు, ఎంవీ.రాజు పాల్గొన్నారు.

గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సహకరించిన కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంతృత్వ, ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు డాక్టర్ పల్లేరు వీరస్వామి, నేదునూరి రాజమౌళి, మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, గుంటి రాజేందర్, సాంబయ్య, పూర్ణచందర్, ఎండీ.ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పునకు పట్టిన పీడ విరగడైంది



స్వీట్లు పంచుతున్న శ్రీనివాస్, ఉషశ్రీపద్మ



వరంగల్ చౌరస్తాలో..

ఖిలా వరంగల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్ ఓటమితో తూర్పునకు పట్టిన పీడ విరగడైందని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండా సురేఖ గెలుపు ప్రజా విజయమని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రధాన రోడ్డుపై మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీపద్మ ఆధ్వర్యంలో ఆదివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అలాగే, శివనగర్‌లో ప్రజానాట్య మండలి అధ్యక్షుడు గడ్డం సుధాకర్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయ రాంచందర్, గజ్జల లింగమూర్తి, శరత్, డాక్టర్ వెంకన్న, పట్వారి సుధాకర్, శామంతుల కిరణ్, శ్రీధర్, అంకం సత్యం, మధు, విజయ్, రాధిక, లక్ష్మి, అంజమ్మ, జారతి సత్యం, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తాలో..

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా కొండా సురేఖ, అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుండడంపై హర్షం వ్యక్తం చేస్తూ వరంగల్ చౌరస్తాలో నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు మర్రి రవీందర్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, కుసుమ రమేష్, వలబోజు శ్రీనాథ్, మహేందర్, సాయిలు, హేమంత్, రమేష్, రాజు, శ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ఆచరణతోనే భరత జాతి ఉన్నతి

వరంగల్: సనాతన సంప్రదాయ ఆచరణ వల్లనే భరత జాతి ఉన్నతికి హైందవ సంప్రదాయ ఎంతో తోడ్పడుతోందని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. ములుగురోడ్డు సమీపంలోని సప్తగురుధామంలో ఆదివారం జరిగిన సామూహిక శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రతాల్లో 500మంది దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహికంగా, సమష్టిగా చేసే ఏ వ్రతమైనా, ఏ యజ్ఞం అయినా అనేక రెట్ల ఫలితం ఇస్తుందని శివానందమూర్తి గురువు తెలిపారని అన్నారు.



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

సామూహిక వ్రతాల్లో పాల్గొన్న వారందరికి ట్రస్టు ద్వారా ఉచితంగా పూజాద్రవ్యాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కృష్ణశర్మ, శ్రీనాథ్‌శర్మ, అనిల్‌శర్మ, ట్రస్టీలు సాయి నారాయణ పాల్గొన్నారు.

అభ్యర్థులందరికీ ఓటేశారు

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేసిన మొత్తం 15మంది అభ్యర్థుల్లో ఎవరికీ కాదనకుండా ఓటర్లు తమ పెద్ద మనసును చాటుకున్నారు. అందరికి కనీసం రెండంకెల ఓట్లు పోలవడం విశేషం. అత్యధిక ఓట్లు గెలుపొందిన అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డికి రాగా, అత్యల్పంగా 93ఓట్లు స్వతంత్ర అభ్యర్థి ఖలీలుద్దీన్‌కు వచ్చాయి. నాయిని రాజేందర్‌రెడ్డి (కాంగ్రెస్) 72649, దాస్యం వినయ్‌భాస్కర్ (బీఆర్‌ఎస్) 57318, రావు పద్మ (బీజేపీ) 30826, యుగందర్ గౌడ్ (ఏడీఆర్పీ) 1399, మాదారపు రవికుమార్ (బీఎస్‌పీ) 808, షాజీహషీర్ (ఆజాద్ సమాజ్ పార్టీ) 243, బొమ్మగాని భార్గవ్ (స్వతంత్ర) 205, గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి (స్వతంత్ర) 186, సత్యప్రకాష్ (స్వతంత్ర) 184, కోగిల రూప (ధర్మసమాజ్ పార్టీ) 172, గడ్డం నాగార్జున (ఎంసీపీఐ (యూ)) 167, అల్లిపురం వేణుచారి (టీడీపీపీ) 129, గుర్రం జక్కయ్య (స్వతంత్ర) 115, కృష్ణ (స్వతంత్ర) 105, మహ్మద్ ఖలీలుద్దీన్ (స్వతంత్ర) 93.

తూర్పు కోటపై కాంగ్రెస్ పాగా..

- నియోజకవర్గం నుంచి రెండోసారి కొండా సురేఖ గెలుపు
- రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావు
- మూడో స్థానానికి పరిమితమైన బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో దశాబ్దకాలం తర్వాత కాంగ్రెస్ పార్టీ జెండా మళ్లీ ఎగిరింది. 2009 ఎన్నికల్లో బస్వరాజు సారయ్య కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందాక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా కొండా సురేఖ, 2018లో నన్నపునేని నరేందర్ పోటీ చేసి గెలుపొందారు. ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా సురేఖ సమీప బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావుపై 15,043 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో తాజా మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు.

మొదటి నుంచి ఆధిక్యంలోనే..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 230 పోలింగ్ బూత్‌ల్లో పోలైన ఓట్ల లెక్కింపు ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి చివర రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ మొదటి స్థానంలో ఉండగా రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావు, మూడో స్థానంలో తాజా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరిమితమయ్యారు. ఏ రౌండ్‌లో కూడా నరేందర్ ఆధిక్యం చూపలేకపోయారు.

రౌండ్ల వారీగా ఓట్ల వివరాలు

రౌండ్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్‌ఎస్
1వ రౌండ్	3,727	3,405	2,370
2వ రౌండ్	5,095	2,374	3,327
3వ రౌండ్	5,320	1,892	2,172
4వ రౌండ్	2,904	3,749	1,562
5వ రౌండ్	3,214	2,895	1,720
6వ రౌండ్	4,468	3,324	3,018
7వ రౌండ్	4,102	2,550	2,248
8వ రౌండ్	2,923	3,953	2,554
9వ రౌండ్	3,988	3,539	2,857
10వ రౌండ్	3,482	3,238	2,691
11వ రౌండ్	4,111	2,719	3,145
12వ రౌండ్	3,988	2,840	2,989
13వ రౌండ్	3,997	4,041	2,562
14వ రౌండ్	4,059	3,716	2,883
15వ రౌండ్	4,624	3,454	2,109
16వ రౌండ్	4,920	2,378	3,409
17వ రౌండ్	1,808	1,619	919

నోటాకు నాలుగో స్థానం

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు మూడు స్థానాల్లో ఉండగా, నోటాకు 1,966ఓట్లు రావడంతో దానికి నాల్గవ స్థానం దక్కింది. బీఎస్పీ నుంచి పోటీ చేసిన ట్రాన్స్‌జండర్ పుష్పిత లయకు 366ఓట్లు రాగా, స్వతంత్ర అభ్యర్థుల్లో కొటం రవీందర్‌కు 1,214ఓట్లు వచ్చాయి.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా కొండా సురేఖ విజయం సాధించారన్న సమాచారం అందడంతో పార్టీ శ్రేణులు కౌంటింగ్ జరుగుతున్న ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్ వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మార్కెట్ నుంచి కాశిబుగ్గ చౌరస్తా వరకు నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేస్తూ ర్యాలీ తీస్తూ రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు

ప్రజా తీర్పును గౌరవిస్తా: అరూరి

హసన్‌పర్తి: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ తెలిపారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. అధికారంలోకి లేకపోయినప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని వెల్లడించారు. ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, రాధికారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు జక్కు రమేష్, గోపాల్ రెడ్డి, సర్పంచ్ అరుణ్, జీవన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు ప్రజలకు అండగా ఉంటా..

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అభ్యర్థిగా ఆదరించి ఓట్లు వేసిన ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజలను తన పట్ల ఆదరణ చూపినందునే అధికార పార్టీ నాయకుడిని వెనక్కి నెట్టి రెండోస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి చెందినా తూర్పు ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటానని ఆయన తెలిపారు.

కొండేటి శ్రీధర్ డిపాజిట్ గల్లంతు

హసన్‌పర్తి: వర్ధన్నపేటలో బీజేపీ అభ్యర్థి డిపాజిట్ గల్లంతైంది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన కొండేటి శ్రీధర్‌కు 11,966 ఓట్లు పోలయ్యాయి. 2009లో కొండేటి శ్రీధర్ ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి సుమారు 5వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మళ్లీ 2014లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి అరూరి రమేష్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కొండేటి శ్రీధర్‌కు పార్టీ టికెట్ ఇవ్వలేదు. పొత్తుల్లో భాగంగా టీజేఎస్ అభ్యర్థి పీ.దేవయ్యను బలపరిచింది. ఆతర్వాత జరిగిన పరిణామాల కారణంగా కొండేటి శ్రీధర్ బీజేపీలో చేరారు.

పేద విద్యార్థులకు కల్పవృక్షం 'ఏవీవీ'



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రామన్నపేట: పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తూ కల్పవృక్షంలా విరాజిల్లుతున్న ఏవీవీ కళాశాలకు తన వంత సహాయాన్ని అందజేస్తానని ఏవీవీ కళాశాల మాజీ విద్యార్థి, సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నం నాగేశ్వరరావు అన్నారు. వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో దివంగత ఆచార్య చందా కాంతయ్య శ్రేష్టి జన్మదినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయకుమార్ అధ్యక్షతన జరిగిన వేడుకలో నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తన ఎదుగుదలకు ఏవీవీ విద్యాసంస్థలే మూలం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట నియోజకవర్గం.. హస్తగతం

- భారీ మెజార్టీతో నాగరాజు గెలుపు
- ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలో హస్తం హవా సాగింది. మొత్తం 26,9192 ఓట్లు నమోదు కాగా, 21,5986 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజుకు 1,04,717 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌కు 86,790, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌కు 11,966 ఓట్లు వచ్చాయి. 2,791 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు (హోం ఓటింగ్‌తో పాటు ఉద్యోగుల ఓట్లు కలిపి) నమోదయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి నాగరాజుకు 1,979, బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌కు 448, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌కు 309ఓట్లు, నోటాకు 11 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాగరాజు తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌పై 17,927 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

మొదటి రౌండ్ నుంచే ఆధిక్యం

మొదటి రౌండ్ నుంచే కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. ప్రతీ రౌండ్‌లో వంద నుంచి రెండు వందల ఓట్లు మెజార్టీ సాధిస్తూ వచ్చారు. 5, 9, 10వ రౌండ్లల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మెజార్టీ వచ్చింది. ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యత ప్రదర్శించారు.

పదేళ్ల తర్వాత..

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గంపై జెండా ఎగురవేసింది. పునర్విభజనలో ఈ నియోజకవర్గం ఎస్సీకి కేటాయించారు. అంతకు ముందు జనరల్ స్థానంగా ఉండేది. 2009లో కాంగ్రెస్ నుంచి కొండేటి శ్రీధర్ గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ నియోజకవర్గంలో 2014, 2018లో టీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన అరూరి రమేష్ గెలుపొందారు. ఈసారి కాంగ్రెస్‌కు ప్రజలు పట్టంగట్టారు.

కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థి గెలుపుపై హర్షం



మడికొండ అంబేడ్కర్ సెంటర్ వద్ద..



బొకే ఇస్తున్న కొడెపాక జితేందర్



వరంగల్: 14వ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో..

మడికొండ: కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్.నాగరాజు గెలుపుపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మడికొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచి, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాజీపేట మండల అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్, నవీన్‌యాదవ్, వేణు, విజయ్, చిన్నకుమార్, దుబాసి పద్మరావు, మద్దెల కుమార్, మూల ప్రశాంత్, దార సతీష్, బుంగ కుమార్, కిన్నెర నరేష్, వంగల శరత్, శ్రావణ్, ఉబ్బని రసజ్ఞ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో..

వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజు ఎమ్మెల్యేగా గెలుపొందడంపై 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్‌నగర్‌లో నాయకులు ఆదివారం బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.